క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి ఆలయంలో వైశాఖ మాసం సోమవారం సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేంకటేశ్వర స్వామికి లక్ష పుష్పార్చన


స్వామి వారికి పుష్పార్చన నిర్వహించిన దృశ్యం

డోన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి లక్ష పుష్పార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజాముననే అభిషేకం, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం మహిళా భక్తులు స్వామి వారికి ప్రీతిపాత్రమైన మల్లెపూలతో అర్చన జరిపించారు. ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేయండి


ఆకుమల్ల గ్రామంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలోని కుంట కట్ట సమీపంలో ఓ విద్యుత్ స్తంభం ఓవైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. అదే రస్తాలోనే అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీయూపీ స్కూల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వర్షాకాలం సమీపిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయభ్రాంతులకు గురౌతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం.. హర్షం


కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వేసవికాలం కావడంతో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వర్షం కురిసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు అనుకూలంగా మారడంతో ఈ ఏడాది ఖరీఫ్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు భావిస్తున్నారు.

గౌరవ వేతనం చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 13వ తేదీన సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలింగ్ సిబ్బందికి ఒక రోజు గౌరవ వేతనం చెల్లించాలని, డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పీఓ, ఏపీఓ, ఓపీఓలకు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఒక రోజు గౌరవ వేతనం తక్కువగా చెల్లించారని, నాలుగు రోజుల ఎన్నికల విధులకు హాజరయ్యే వారందరికీ డ్యూటీ సర్టిఫికెట్ సంబంధిత అధికారుల ద్వారా ఇవ్వాలని కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, గౌరవ వేతనంతో పాటు భోజనం అలవెన్స్‌ను ఎన్నికల కౌంటింగ్ తర్వాత తప్పక చెల్లిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. పుల్లయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పురాతన మంటపం


ఆలయ ప్రాంగణంలో విగ్రహాలు


వీరభద్రస్వామి విగ్రహం


సీతారాముల విగ్రహాలు

నాటి విశ్వబ్రహ్మపురమే.. నేటి మునిమడుగు

విశ్వబ్రహ్మం తపస్సుకు మెచ్చి కాళికాదేవి వరంతో పట్టణంగా విరాజిల్లి.. అమ్మవారి ఆదేశాలను పాటించకపోవడం, వీరబ్రహ్మేంద్రస్వామి సతీమణి గోవిందమాంబ ఆగ్రహానికి గురై వైభవాన్ని కోల్పోయి మునిమడుగుగా మిగిలిపోయింది విశ్వబ్రహ్మపురం. అయితే గోవిందమాంబ కరుణతో శాపం నుంచి బయటపడి మళ్లీ నాటి వైభవం వస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

- కాళికాదేవి ఆశీస్సులతో పట్టణంగా అభివృద్ధి
- కాళికాదేవి,గోవిందమాంబ శాపంతో కోల్పోయిన ప్రాభవం
- భవిష్యత్‌లో పూర్వవైభవం రానుందని గ్రామస్తుల నమ్మకం
- నాటి వైభవానికి సాక్ష్యాలుగా ప్రాచీన కట్టడాలు


ఆలయంలో కొలువైన దేవతామూర్తి


గ్రామంలోని కాళికాదేవి ఆలయం

ప్యాపిలి: ఒకప్పుడు విశ్వబ్రహ్మపురంగా విరాజిల్లిన మునిమడుగు నేడు కుగ్రామంగా మిగిలిపోయింది. మండల కేంద్రానికి 37 కిలోమీటర్ల దూరంలో ఉన్న మునిమడుగు గ్రామం చారిత్రకంగా ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంది. ఒకప్పుడు వజ్ర వైఢూర్యాలు, అష్టైశ్వర్యాలతో పట్టణంలా తులతూగిన మునిమడుగు చరిత్ర కాళికాదేవి, గోవిందమ్మతో ముడిపడింది. దాదాపు 95 ఎకరాల విస్తీర్ణంలో అప్పటి రాచరిక పాలనలో వజ్రాలను రాసులుగా పోసి అమ్మిన చరిత్ర కలిగిన ఈ గ్రామం నేడు అభివృద్ధికి దూరంగా నిలిచిపోయింది. కాళికాదేవి ఆశీస్సులతో పట్టణంగా మారిన గ్రామం..గోవిందమ్మ శాపంతో తన ప్రాభవాన్ని కోల్పోయింది.

కాళికాదేవి ఆశీస్సులతో..

స్థానిక సమాచారం మేరకు.. ఇక్కడ ఓ కథ ప్రాచుర్యంలో ఉంది...ఈ ప్రాంతానికి చెందిన విశ్వబ్రహ్మం అనే వ్యక్తి ఘోర తపస్సు చేసి కాళికాదేవిని ప్రసన్నం చేసుకున్నాడు. అమ్మవారి ఆశీస్సులతో ఆ ప్రాంతం 95 ఎకరాల విస్తీర్ణంలో విశ్వబ్రహ్మపురం అనే పేరుతో పెద్ద పట్టణంగా ఏర్పడింది. అయితే కాళికాదేవి చెప్పినట్లుగా ఆ వ్యక్తి విశ్వబ్రహ్మపురంలో భద్రకాళి, వీరభద్ర స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించకుండా నిర్లక్ష్యం వహించాడు. దీంతో ఆగ్రహించిన అమ్మవారు విశ్వబ్రహ్మపురం వల్లకాడు కావాలని శపించింది. మహానగరంగా వర్ధిల్లిన విశ్వబ్రహ్మపురం కొద్ది సంవత్సరాలకే పాడుపడిపోయింది. ఇదిలా ఉండగా విశ్వబ్రహ్మం, కామాక్షిదేవి దంపతులకు వీరనారాయణాచారి అనే కుమారుడు పుట్టాడు. ఓ రోజు విశ్వబ్రహ్మం స్నానం ఆచరించేందుకు గ్రామంలోని ఓ మడుగులోకి దిగి తిరిగి రాకపోవడంతో అప్పటి నుంచి ఈ గ్రామానికి మునిమడుగు అనే పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతోంది.

గోవిందమ్మ శాపం..

కొంత కాలం తర్వాత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కుమారుడు పోతులూరయ్య మునిమడుగు గ్రామానికి చేరుకుంటాడు. అయితే వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి పొందినప్పటికీ గోవిందమాంబ ముత్తయిదువగానే ఉండటంతో 'నీ తల్లి ముత్తయిదువగానే ఉందని..నీ లాంటి వారు మా గ్రామంలోకి అడుగుపెడితే గ్రామానికి అరిష్టం కలుగుతుందని' గ్రామస్తులు పోతులూరయ్యను వెనక్కి పంపుతారు. విషయాన్ని పోతులూరయ్య తన తల్లి గోవిందమాంబతో చెబుతాడు. దీంతో ఆగ్రహించిన ఆమె 'మునిమడుగు ముదనష్టమవు గాక' అని శపిస్తుంది. చేసిన తప్పును తెలుసుకున్న గ్రామస్తులు శాపాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా ఆమెను ప్రాధేయపడతారు. భవిష్యత్‌లో మునిమడుగు దినదిన ప్రవర్ధమానమై 12 ఆమడల పట్టణమై ప్రఖ్యాతిగాంచునని పేర్కొంటుంది.

శాపవిమోచనమయ్యేనా?

స్థానిక పరిస్థితులను బట్టి చూస్తుంటే గోవిందమ్మ వరమిచ్చినట్లే మునిమడుగు భవిష్యత్‌లో పట్టణంగా మారే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి 15 కిలోమీటర్ల దూరంలో బోయినచెరువుపల్లి వద్ద ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటై ఆ ప్రాంతం పట్టణశోభను సంతరించుకుంటోంది. మునిమడుగు గ్రామంలో కూడా సిమెంట్ రాతి నిక్షేపాలు ఎక్కువగా ఉన్నందున ఇక్కడ కూడా సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు కంపెనీలు స్థల సేకరణ పనులు చేపట్టాయి. దీంతో శాపవిమోచనం త్వరగా కలిగే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాటి వైభవానికి సజీవ సాక్ష్యాలు..

ముత్యాలు, వజ్రాలను పెద్ద బజారులో రాసులుగా పోసి అమ్మిన మునిమడుగు గ్రామానికి ముత్యాల మునిమడుగు అని, పక్కనే ఉన్న రాచర్లను రతనాల రాచర్ల అని పిలిచేవారు. ఈదం రంగభూపాలుడు పాలించిన ఈ గ్రామంలో అప్పట్లో 360 విశ్వబ్రాహ్మణ కుటుంబాలు నివసించేవి. ఇంటి అవసరాల కోసం ప్రతి ఇంటి ఆవరణలో ఓ బావి ఉండేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికీ కొన్ని ఇళ్లతో పాటు కాళికాదేవి ఆలయంలో నాటి బావులు దర్శనమిస్తున్నాయి. గ్రామంలో కాళికాదేవి, వకులాదేవి, గోపాల స్వామి, ఆంజనేయ స్వామి, నాగులకట్ట, వీరభద్ర స్వామి తదితర 40 దేవాలయాలు, 6 కోనేరులు ఉండేవి. ప్రస్తుతం కొన్ని దేవాలయాలు మాత్రమే పూజలందుకుంటున్నాయి. గుప్త నిధుల తవ్వకాల్లో చాలా దేవాలయాలు కనుమరుగైపోయాయి. ప్రస్తుతం కాళికాదేవి ఆలయాన్ని కలుగొట్ల రామచంద్రారెడ్డి నాయన జీర్ణోద్ధరణ చేసి నిత్యాన్నదానం చేస్తున్నాడు. గ్రామానికి చెందిన భాస్కర్ నాయుడు ఆలయాల బాగోగులను చూసుకుంటున్నారు.

పచ్చిరొట్ట పైరుతో భూసారం


బేతంచెర్ల సమీపంలో సాగవుతున్న పచ్చిరొట్ట పైరు

బేతంచెర్ల: రబీసాగు అనంతరం పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం వల్ల భూసారాన్ని పెంచుకొని తద్వార రసాయన ఎరువులను తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అధిక రసాయనిక ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. కట్టి జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి వంటి పచ్చిరొట్ట పైర్లను పూత దశ వరకు భూమిలో పెంచి కలియదున్నాలని చెప్పారు. పచ్చి రొట్ట పైర్లలో నత్రజని 1.8 శాతం నుంచి 3,5 శాతం వరకు, భాస్వరం 0.1 శాతం నుంచి 3.5 శాతం వరకు, పొటాషియం 0.5 శాతం నుంచి2.0 శాతం వరకు ఉంటాయన్నారు. పంట ఎదుగుదల, దిగుబడికి ఈ మూడు పోషకాలు ఉండటం వల్ల రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదన్నారు. వీటి సాగు వల్ల 30 శాతం వరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. పచ్చిరొట్ట పైరు ఎరువు వల్ల సేంద్రియ పదార్థాలు పెరిగి, తద్వార అన్ని రకాల నేలలకు రసాయన, జీవ సంబంధిత లక్షణాలు మెరుగుపడతాయి. నేలలో ఆరోగ్య వంతమైన ఉత్పాదకత పెరుగుతుంది. ఎకరానికి 50 కిలోల వరకు నత్రజని అందుతుంది. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. రైతులందరూ పచ్చిరొట్ట పైర్లను వేసవి ప్రారంభంలో సాగుచేయడం మంచిదని పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నంద్యాల(అర్బన్): నాణ్యత కలిగిన విత్తనాలను మాత్రమే దుకాణ దారులు రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. విత్తనం కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వకపోతే విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని నందమూరినగర్ రోడ్డులోని శ్రీ అన్నదాత, రైతు మిత్ర ఏజెన్సీస్ దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, స్టాక్ బ్యాలెన్స్ తదితరాలను పరిశీలించారు. అనంతరం ఆయా ఏజెన్సీల్లోని విత్తన నమూనాలను హెచ్‌టీ పరీక్షలకు తరలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించవద్దని సూచించారు.

కొత్తూరులో కలెక్టర్ సతీమణి పూజలు


కలెక్టర్ సతీమణి నళినికి తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సతీమణి నళిని సోమవారం పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించుకున్నారు. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. స్వామి వారి దర్శనమనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ నాగలింగేశ్వరస్వామి వారికి పూజలు చేశారు.

గురు, శిష్యుల బంధం చాలా గొప్పది

బేతంచెర్ల: గురు శిష్యుల బంధం చాలా గొప్పదని హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, వెంకట్రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1999–2000 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 24 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు వెంకట్రావు, వెంకటరెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, హనీఫ్ హజరత్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు మధు శేఖర్, మాధవ్, దాదావలీ, సయ్యద్, బాల వెంకటరమణ, సుమంత్, మధు, చంద్ర కళ, రాజేశ్వరి, సుభద్ర, గాయత్రీ, మాధవి, నీలిమ, వరలక్ష్మి పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

ఉమామహేశ్వరస్వామికి పల్లకీసేవ


శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకీ సేవా కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వాతి నక్షత్రం వేడుకలు


పూజలందుకున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన చెంచులక్ష్మీ సమేత పావన నరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వాతి నక్షత్రం, నరసింహస్వామి జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకులు, ప్రధాన అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి సోమవారం తెలిపారు. జయంతి కార్యక్రమంలో భాగంగా ఉదయం నరసింహస్వామికి తులసి దళాలతో అర్చన, కుంకుమార్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. నరసింహస్వామి స్వాతి నక్షత్రంలో జన్మించినట్లు పురాణాల్లో పేర్కొనడం జరిగిందన్నారు. ఈ స్వాతి వేడుకలు మంగళ, బుధవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మహానంది: మండలంలోని బుక్కాపురం పెట్రోల్ బంక్ వద్ద సోమవారం మహానంది వెళ్తున్న ఓ బైక్ ఎగిరిపడటంతో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనుమతులు లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంవల్లే ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నంద్యాల–మహానంది రహదారిలో అనుమతులు లేకుండా ఎవరి స్వార్థం కోసం వారు ఏర్పాటు చేసుకున్న స్పీడ్ బ్రేకర్ల ద్వారా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనధికారికంగా ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

కొలిమిగుండ్ల: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, తమ కళాశాల సిబ్బందితో కలిసి గ్రామాలకు వెళ్లి విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ కళాశాలలో చేర్పించే విధంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. మంచి అధ్యాపకులు ఉండడంతో ఏటా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని, ఈ నెల చివరితో మొదటి విడత అడ్మిషన్లు పూర్తవుతాయని వెల్లడించారు. కళాశాలలో అన్ని గ్రూపులు ఉన్నాయని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 99592 25798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

బనగానపల్లె డిపోలో..

బనగానపల్లె: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రవికిశోర్ తెలిపారు. బనగానపల్లె డిపో పరిధిలోని ప్రజా రవాణా సమస్యలపై ఫిర్యాదు చేయాలనుకుంటే, అలాగే మెరుగైన సేవల కోసం సలహాలు ఇవ్వదలచుకుంటే ఉదయం 11–12 గంటల మధ్య 99592 25802 నంబరుకు ఫోన్ చేయాలని డీఎం కోరారు.

విత్తనాలకు ప్రతిపాదనలు

బేతంచెర్ల : మండంలో ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి రైతులకు సబ్సిడీ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఏఓ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. 1,100 క్వింటాళ్ల వేరుశనగ, 60 క్వింటాళ్ల కంది, కొర్రలు – 5 క్వింటాళ్లు, మినుములు– 5 క్వింటాళ్లు, పెసలు –5 క్వింటాళ్లు చొప్పున్న మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

ప్యాపిలి: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు ముగిశాయి. రెండు రోజులుగా బాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

స్వచ్ఛమైన నీటిని తాగాలి

ప్యాపిలి: గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛమైన నీటినే తాగేలా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సాయిమనోహర్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలకు అవగాహన లేక గ్రామ పంచాయతీ సరఫరా చేసే నీటిని జాగ్రత్తలు పాటించకుండా తాగడం ప్రమాదమన్నారు. కాచి వడబోసిన నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిదనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని సూచించారు. శుభ్రం చేసిన, తర్వాత శుభ్రం చేయబోయే తేదీని ట్యాంకుపై రాయాలని చెప్పారు.


నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండలంలోని ఎం.పెండేకల్లు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా సోమవారం తెలిపారు. దాడుల్లో వెల్దుర్తి మండలం, సిద్దన్నగట్టు గ్రామానికి చెందిన రామనాయుడు నాటుసారా విక్రయిస్తుండగా 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

నీలి మేఘం.. ఎరుపెక్కిన ఆకాశం..

సోమవారం సాయంత్రం.. క్రిష్టిపాడు గ్రామ సమీపంలోని కుందూ నది ఒడ్డున ఆవిష్కృతమైన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. భానుడు అస్తమిస్తున్న సమయంలో ఆకాశం అరుణ వర్ణంలోకి మారిపోతుండగా.. ఒక్కసారిగా నీలి మేఘాలు సూర్యాస్తమయ దృశ్యాలను కమ్మేశాయి. అయినా అక్కడక్కడా నీలి, తెలుపు మేఘాల మాటున ఎరుపెక్కిన ఆకాశం కనిపించింది. ప్రకృతి గీసిన ఈ వర్ణచిత్రం ప్రకృతి ప్రేమికులను పరవశింపజేసింది.

– దొర్నిపాడు



ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక వంద పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు, స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్‌తో కేక్ కట్ చేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు సీసంగుంతల రంగారెడ్డి,కలచట్ల చంద్రశేఖర్, స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపకులు ఆలా మధు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో ఎన్టీఆర్ వెల్ఫేర్ బేతంచెర్ల సభ్యులు హుసేన్, ఆర్ఆర్‌డీజే మధు, వినోద్ తారక్, జాకిర్, మధు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు.